క్లుప్తంగా

వేరుశనగ పంట ధ్వంసం


అడవి పందులు పంటను ధ్వంసం చేసిన దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుర్రుపు కొండ సమీపంలో ముందస్తు వర్షాలకు సాగు చేసిన వేరుశనగ పంటను రాత్రి సమయంలో అడవి పందులు ధ్వంసం చేశాయని రైతు నాగేంద్రప్ప వాపోయారు. అప్పులు చేసి సాగు చేసిన వేరుశనగ పంటలో 40 నుంచి 40 వరకూ కాయలు ఉన్నాయని, ఈ నెలలో పంటను తొలగించాల్సి ఉందన్నారు. మూడు రోజుల నుంచి గుంపులు గుంపులుగా అడవి పందులు రాత్రి సమయంలో పంటలోకి ప్రవేశించి ధ్వంసం చేసి తీవ్రంగా నష్టపరిచాయన్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని పంటను పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

మడకశిరరూరల్: మండల పరిధిలోని తురుకువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరంజీవి పొలంలో కాలు జారీ కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వైద్య చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను ఆ పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, బీసీ సెల్ నాయకులు సత్యనారాయణ, హనుమంతు తదితరులు మంగళవారం పరామర్శించారు.

న్యాయవాది ఆదిశేషారెడ్డికి ఘన నివాళి


సంతాపం తెలియజేస్తున్న హిందూపురం న్యాయవాదులు

హిందూపురం: అనంతపురానికి చెందిన సీనియర్ న్యాయవాది ఆదిశేషారెడ్డి ఆకస్మిక మృతిపై హిందూపురం న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఆదిశేషారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని పలువురు న్యాయవాదులు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగరాజారెడ్డి, నాగరాజు, సుదర్శన్, సిద్దు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడి సాధించాలి


రైతులు సూచనలిస్తున్న ఏఓ శ్రీకృష్ణ


పరిగి: వ్యవసాయంలో రైతులు అధిక దిగుబడిని సాధించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు. మండలంలోని పీ నరసాపురం, ధనాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశిస్తోందన్నారు. నివారణకై ఎకరాకు ఎమామేక్టిన్ బెంజయోట్‌ను వాడాలన్నారు. పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో తుమ్మల మారెమ్మ

గుడిబండ: పట్టణ సమీపంలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అనంతరం వెండి, బంగారు ఆభరణాలతో పాటు వివిధ రకాల పూలతో అలంకరించి, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు.

వినూత్నంగా కలుపుతీత



పరిగి: మండలంలోని గొరవనహళ్లికి చెందిన హనుమంతరాయప్ప కూలీల ఖర్చు భరించలేక మొక్కజొన్న పొలంలో కలుపుతీతకై వినూత్న ప్రయోగాన్ని చేశాడు. దాదాపు రూ.5 వేలతో కలుపుతీతకు సైకిల్లాంటి యంత్రాన్ని తయారు చేయించాడు. కలుపుతీత మొదలుపెట్టాడు. కూలీలు దొరకక అవస్థలు పడుతున్నామని, అందుకే తానే కలుపుతీతకు శ్రీకారం చుట్టినట్లు హనుమంతరాయప్ప తెలిపారు.

● పొంచి ఉన్న ప్రమాదం


మెళవాయిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైరు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి బస్టాండ్ సమీపంలో చెట్టు కొమ్మలో ఉన్న విద్యుత్ వైరు ప్రమాదకరంగా మారింది. జోరు గాలి వీస్తే చెట్టు కొమ్మ ఊగినప్పుడు విద్యుత్ వైరు తెగి కింద పడే అవకాశం ఉందని, ఆ సమయంలో అక్కడ ఎవరైనా ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు. సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● 'మురుగు'తున్న పంటలు

పావగడ: పట్టణంలో నుంచి మురుగు కాల్వల్లో ప్రవహించే మురుగు నీరంతా సమీపం లోని రొప్పం గ్రామానికి చేరుతోంది. మురుగంతా తమ పచ్చని పంటలను పాడు చేస్తోందని బాధిత రైతులు వాపోతున్నారు. రైల్వే బ్రిడ్జ్ క్రింద డక్ ఏర్పాటు చేయకపోవడంతో వరదలా ప్రవహించే మురుగు నీరు పంట పొలాల్లోకి చేరుతోందంటున్నారు. రైల్వేశాఖకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే డక్ నిర్మించి మురుగు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


మురుగు నీరు ప్రవహిస్తున్న దృశ్యం

● కట్టెలే కరెంటు స్తంభాలు


రొద్దం పెన్నానది సమీపంలో కట్టెలపై విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసిన దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని రొద్దకాంబ దేవాలయం వెనక భాగాన పెన్నానది పరివాహక ప్రాంతంలో ఉన్న రైతుల వ్యవసాయ బోర్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు కట్టెలే ఆధారమయ్యాయి. చేతి కందే ఎత్తులో వేలాడుతూ ప్రమాదంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను పైకి లాగాలని కోరుతున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

● వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప


మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

రొళ్ల: కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ఎండగట్టేలా గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. ఈ నెల 10లోపు గ్రామస్థాయి కమిటీల నియమకాలను పూర్తి చేసి ఆ వివరాలను మండల ఇన్‌చార్జ్‌కు సమర్పించాలన్నారు. అలాగే ఈనెల 24వ తేదీ నుంచి పంచాయతీ స్థాయిలో ప్రభుత్వ తీరును ఎండగట్టడం కోసం 'రచ్చబండ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. మంగళవారం మండలంలోని బీజీ హళ్లి పంచాయతీ పరిధిలోని టీడీ పల్లి, మల్లినమడుగు పంచాయతీ కేంద్రాల్లో పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగవేణి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం కోసం ఎంతకైనా దిగజారుతారన్నారు. అమలు చేస్తున్న అరకొర సంక్షేమ పథకాల్లోనూ భారీగా కోతలు విధించడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వంలో కేవలం కూటమి నాయకులు మాత్రమే బాగుపడుతున్నారే తప్ప సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇప్పటికీ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల వల్ల రూ.50 వేల నుంచి రూ.7 లక్షల వరకూ ఆర్థికసాయం అందించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి లోకేష్, సర్పంచులు సదాశివప్ప, శారదమ్మ, ఈసీ మెంబర్ రఘువీర్, మండల ప్రధాన కార్యదర్శి మంజునాథ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విజయరంగేగౌడు, నాగేంద్ర, మాజీ సర్పంచ్ శ్రీరామప్ప, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, ఎం.నాగరాజు, ముదుపేగౌడు, మాజీ వైఎస్ సర్పంచ్ గోవిందరాజు, వైఎస్ సర్పంచులు రవికుమార్, సీఎం ఘట్ట రవి, నాయకులు జీరిగేపల్లి దేవరాజు, శ్రీరామిరెడ్డి, మారన్న, ఎంజే యంజారప్ప, రవిచంద్ర, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, గొట్టుగుర్కి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూటమి హామీలు .. నీటి మీద రాతలే...


మోసం గ్యారెంటి క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అగళి: ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఎన్నో హామీలు గుప్పించారని, అధికారం చేపట్టిన తర్వాత మాత్రం అవి నీటి మీద రాతలుగానే మారాయని వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు సాయిలీల విమర్శించారు. మండల పరిధిలోని పీ.బ్యాడగేర, హెచ్‌డీ హళ్లి పంచాయతీలో బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలీల మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 మాసాలు అవుతున్నా సక్రమంగా పథకాలను అమలు చేయడం లేదన్నారు. గతేడాది పంటలకు గిట్టుబాట ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుతం ఖరీఫ్ కింద సాగు అయిన పంటలకు ఎరువులు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, సర్పంచులు ముద్దరాజు, రామకృష్ణప్ప, నరసమ్మ, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు జయరామప్ప, సతీష్, మధు, లింగరాజు, ఈరన్న, తిమ్మరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ'

గుడిబండ: మండలం పరిధిలోని జంబులబండ, మందలపల్లి గ్రామంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ఓ ప్రకటనలో తెలిపారు. జంబులబండలో ఉదయం 11 గంటలకు, మందలపల్లిలో మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

అగళి: మండల పరిధిలోని హళ్లికేర్, రావుడి పంచాయతీల్లో బుధవారం పంచాయతీస్థాయిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మండల అబ్జర్వర్ సాయిలీల హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వసతి గృహాల్లో సమస్యలు పట్టవా ?


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

హిందూపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ సాంఘిక సంక్షేమ గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. పురంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల హాస్టల్ సొంత భవనం నిర్మించాలని, శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ వసతి గృహాలకు మరమ్మతులు చేయించాలన్నారు.

పాఠశాలలో రికార్డుల పరిశీలన

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంఈఓలు 1, 2 భాస్కర్, నరసింహమూర్తి సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికతో పాటు రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంఘాల పనితీరుపై ఆరా

లేపాక్షి: స్థానిక నందీశ్వర మండల సమాఖ్యలో జరుగుతున్న జిల్లా సమాఖ్య ఈసీ సమావేశాన్ని విజయనగరం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఫణి మంగళవారం సందర్శించారు. ఈ నేపథ్యంలో ఇక్కడ జరుగుతున్న జీవనోపాధులు గురించి చర్చించారు. మండల వ్యాప్తంగా ఉన్న సంఘాల పనితీరు తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలోని 32 మండలాలకు సంబంధించిన మండల సమాఖ్య అధ్యక్షులు, డీపీఎం ఫైనాన్స్ రామిరెడ్డి, డీపీఎంకే సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

ఆలయ జీర్ణోద్ధరణ పూజలు

రొద్దం: మండల పరిధిలోని శేషాపురంలో ఆదినారాయణస్వామి ఆలయంలో మంగళవారం జీర్ణోద్ధరణ పూజలు ప్రారంభించారు. పంచముఖ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ధ్వజస్తంభ స్థాపన, గణపతి పూజ, గోపూజ, తదితర పూజలు నిర్వహించారు.

ముర్రుపాలు అమృతంతో సమానం


అగళి: తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానమని పంచాయతీ కార్యదర్శి ఈరన్న పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నిద్రగట్టలో అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కావ్య, అనసూయ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగళి: తల్లులు విధిగా తమ బిడ్డలకు పాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలవతి పేర్కొన్నారు. మండల పరిధిలోని నరసబుంది, మధూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో తల్లులు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

హిందూపురం: మహిళలు, విద్యార్థినులకు పోలీసు శక్తి యాప్ ఒక భద్రత కవచం లాంటిదని, శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వన్‌టౌన్ పోలీసులు కోరారు. మేళాపురంలోని దీప్తి హైస్కూల్‌లో మంగళవారం శక్తి యాప్‌పై పోలీసులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. మహిళలు, చిన్నారుల భద్రత రక్షణ కోసం పోలీస్ శాఖ శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు.

ఆర్డీటీ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి

లేపాక్షి: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని ఆర్డీటీ మండల సీఈసీ సభ్యులు తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి మంగళవారం వినతిపత్రమిచ్చారు. ఆర్డీటీ సేవలను గుర్తించి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించండి

అమరాపురం: మండలంలో విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల విద్యాశాఖాధికారి 1 సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంఘాల మండల అధ్యక్షులు విశ్వేశ్వర, కార్యదర్శి గుమ్మన్న, హనుమంతరాయప్ప, అశోక్‌లతో పాటు ఉపాధ్యాయులు ఎంఈఓ 1ను కలిశారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓను సన్మానించారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

హిందూపురం టౌన్: విద్యార్థి, యువత దురలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేసీకే నాయక్ పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షతన మంగళవారం యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ శ్రీలక్ష్మీ, ఎన్‌సీసీ ఆఫీసర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సంతేబిదనూరులో 'పొలం పిలుస్తోంది'

హిందూపురం: మండల పరిధిలోని సంతేబిదనూరు, బేవినహళ్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న, కంది పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పుష్పలత, రైతు సేవా కేంద్రం సిబ్బంది చంద్ర శేఖర్, రైతులు శ్రీరాములు, అంజినప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి


హిందూపురం: తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న జర్నలిస్టులు


గుడిబండ: డీటీ రాంభూపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు


గోరంట్ల: తహసీల్దార్ మారుతీకి వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

సాక్షిబృందం: జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని జర్నలిస్టులు నిరసన తెలిపారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్, ఇంటి స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించాలని, జర్నలిస్టు పిల్లలకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచిత బోధన అందించాలన్నారు. హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్: విద్యుత్ స్మార్ట్‌మీటర్లను బిగించి ప్రజలపై భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ హిందూపురం కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చిన నారా లోకేష్ .. అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ స్మార్ట్ మీటర్ల పేరుతో దాదాపు రూ.13 వేల కోట్లు ప్రజలపై భారాన్ని మోపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. షిర్డి సాయి ఎలక్ట్రికల్స్ అవినీతి అక్రమాలను గతంలో సీపీఐ బయటపెట్టిన వాటిని రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేడు మళ్లీ అదే కంపెనీతో స్మార్ట్ మీటర్లు ఒప్పందం కొనసాగించడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో కమల్‌బాషా, సమీవుల్లా, అన్సర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన


చిలమత్తూరు మండలం కనిశెట్టిపల్లిలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు


చిలమత్తూరు: కుషావతికి చేరుతున్న వరద నీరు

మడకశిర: నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో వర్షం దంచికొట్టింది. సోమవారం రాత్రి 157.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అగళిలో 48.6, మడకశిరలో 38.8, రొళ్లలో 29.4, అమరాపురంలో 29.4, గుడిబండలో 11.4 ఎంఎం చొప్పున వర్షం కురిసిందన్నారు.

పరిగి: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దాదాపు 30.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని బీచిగానిపల్లిలో కురిసిన వర్షంతో పలు ఇండ్లలో వర్షపు నీరు ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మంగళవారం సాయంత్రం మూడు గంటల నుంచి ఎడతెరపి లేకుండా దాదాపు రెండు గంటల పాటూ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

చిలమత్తూరు: మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎడతెరపిలేని వర్షం కురవడంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. కోడూరు పంచాయితీలోని కనిశెట్టిపల్లి వద్ద ఎగువన కురిసిన వర్షానికి గ్రామంలో భారీగా నీరు వంక పారడంతో నీళ్లన్నీ కుషావతి నదికి చేరుతున్నాయి.


పరిగి మండలం బీచిగానిపల్లిలో ఓ ఇంట్లో చేరిన వర్షపు నీరు


పరిగిలోని 40 ఇండ్ల కాలనీలో..


చిలమత్తూరు మండలం మరవకొత్తపల్లి వద్ద కురుస్తున్న వర్షం


పరిగి: వర్షంలో తడుస్తూనే ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు